ప్రజాశక్తి

గురువారం 27 జూన్ 2024 5 అనంతపురం

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం నాయకులు

చీనీ రైతులను ఆదుకోండి

ఎమ్మెల్యే దగ్గుపాటికి రైతుసంఘం వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పంట సాగు చేసి ఈనామ్, కమీషన్ తదితర వాటి ద్వారా నష్టపోతున్న చీనీ రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం నాయకులు కోరారు. అనంతపురం చీని మార్కెట్ యార్డులో ఈనామ్ వ్యవస్థ రద్దు చేసి, పులివెందుల మార్కెట్ యార్డు మాదిరిగా వేలం పాట ద్వారా అమ్మకాలు జరపాలని, మార్కెట్ నిబంధనల ప్రకారం నాలుగు శాతం కమిషన్ వసూలు చేయాలని కోరుతూ రైతుసంఘం నాయకులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు బుధవారం నాడు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సుమారు 42,490 ఎకరాల్లో 10,62,260 టన్నులు చీని పంటను రైతులు పండిస్తున్నారన్నారు. పాలకులు రైతుల పంటకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం వల్ల దళారుల చేతుల్లో రైతులు నలిగిపోతున్నారన్నారు. రైతులకు ప్రయోజనం కలుగుతుందని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈనామ్ విధానంలో రైతుల కంటే వ్యాపారస్తులకే ఎక్కువ ప్రయోజనం ఉందన్నారు. రైతులు నష్టపోకుండ చీని కాయలు మార్కెట్‌లో ఈనామ్ రద్దు చేసి వేలం పాట ద్వార అమ్మకాలు జరపాలన్నారు. తోటల్లో సూట్ తీసుకునే విధానం రద్దు చేసి సూటు (టన్నుకు 200 కిలోలు అదనంగా) చీనీ కాయలు కొనే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం తీసుకుంటున్న కమీషన్ 10 శాతం నుండి 4 శాతంకు తగ్గించాలన్నారు. గతంలో ఇతర రాష్ట్రాల చీనీ కొనుగోలు నిమిత్తం వచ్చే వ్యాపారస్తులను రప్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. పులివెందుల మార్కెట్ కమిటీ మాదిరి వేలం పాటల నిర్వహించి రైతులను ఆదుకోవాలన్నారు. పెరుగుతున్న పండ్లతోటలకు అనుగుణంగా షెడ్లు నిర్మాణం, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో చీని పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు, బి.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల విజృంభన

◆ చాపకింద నీరులా వ్యాపిస్తున్న డయేరియా

◆ పెరిగిన దోమలు... విస్తరిస్తున్న జ్వరాలు..!

◆ భయాందోళనలో జనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వర్షాకాలం మొదలవడంతో సీజనల్ జబ్బులు భయపెడుతున్నాయి. ఒకవైపు డయేరియా చాపకింద నీరులా విజృంబిస్తుండగా, జ్వరాలు కూడా అదే స్థాయిలో కలవర పెడుతున్నాయి. ఈ ఏడాది ఎప్పుడూలేనంతగా జూన్ నెలలో వర్షాలు పడ్డాయి. సాధారణం కంటే 170 శాతం అధికంగా వర్షాలు పడ్డాయి. గుంతలు, చిన్న కుంటల్లోకి నీరు చేరడడంతో దోమల బెడద సైతం పెరిగింది. దీంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. అంటు వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లా ఉన్నత స్థాయి అధికారులు వైద్యఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు.

పామిడిలో ఇద్దరు మృతి ..

డయేరియా (అతిసార) జిల్లాలో విజృంభిస్తోంది. దీని బారిన పడుతున్న వారి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. సోమవారం వరకు 16 మంది బాధితులుండగా రెండు రోజుల్లో ఈ సంఖ్య 60కిపైగా పెరిగింది. అదే విధంగా పామిడి మండలం రామగిరి ఎగువతాండలో ఇప్పటికే ఇద్దరు దీని బారినపడి మృత్యువాతపడ్డారు. వారం రోజుల క్రితం పెద్దమ్మ(60) అనే మహిళా మృతి చెందింది. మంగళవారం నాడు రేణుక (22) మృతి చెందారు. ఈ రకంగా క్రమక్రమంగా డయేరియా బాధితులు సంఖ్య పెరుగుతోంది. గుత్తిలోని గురుకులంలోనూ విద్యార్థులు డయేరియా బారిన పడ్డారు. నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్ ఇటీవలే మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇది విస్తరించకుండా ఉండే విధంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

విస్తరిస్తున్న జ్వరాలు

వర్షాలు పడి నీరు కుంటల్లోకి, లోతట్టు ప్రాంతాల్లోకి చేరడంతో దోమల బెడద పెరిగింది. దీని వల్ల జ్వరాలు విస్తరిస్తున్నాయి. మలేరియాతోపాటు కామెర్లు సైతం వ్యాపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో బాధితులు బారులు దీరుతున్నారు. జ్వర పీడితులతో కిటకిట లాడుతున్నాయి. సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్నా ఇవి ప్రభలకుండా తీసుకోవాల్సిన చర్యలు ఉండటం లేదన్న విమర్శలున్నాయి. దోమల నివారణకు ఎక్కడా ఫాగింగ్ జరుగుతున్న దాఖలాల్లేవు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మురుగునీరు నిలువున్న ప్రాంతాల్లో దోమల నివారణకు అవసరమైన పిచికారి కూడా లేదన్న విమర్శలున్నాయి.

రజాపురం గురుకుల పాఠశాలలో డయేరియా సోకిన విద్యార్థినిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

రజాపురం బాలికల గురుకుల పాఠశాలలో డయేరియా

గుత్తి : అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని రజాపురం గ్రామం వద్ద ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు డయేరియా సోకింది. బుధవారం నాడు ఏకంగా పాఠశాలలోని 17 మంది విద్యార్థులు డయేరియా లక్షణాలతో వాంతులు, విరోచనాలకు గురయ్యారు. స్పందించిన గురుకుల పాఠశాల సిబ్బంది విషయాన్ని వైద్య ఆరోగ్య సిబ్బందికి తెలియజేశారు. వెంటనే వైద్య సిబ్బంది గురుకుల పాఠశాలకు చేరుకుని అక్కడే విద్యార్థినులకు వైద్య చికిత్సలు అందించారు. డయేరియా సమాచారం తెలుసుకున్న ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి, తహశీల్దార్ బి.భారతి, ఎంపీడీవో శ్రీనివాసులు, బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ కుమార్‌లు గురుకుల పాఠశాలను సందర్శించారు. డయేరియా వ్యాపించడానికి గల కారణాలను ఆరా తీశారు. విద్యార్థినులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. కాగా డయేరియా సోకడంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు ఆందోళనకు గురవుతున్నారు. కొందరు విద్యార్థినులు వాళ్ల ఊర్లలోనే అతిసారకు గురయ్యి పాఠశాలకు వచ్చారని, తల్లిదండ్రులు పిలిపించి విద్యార్థులను వారి స్వగ్రామాలకు పంపించామని పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. ప్రస్తుతం 17 మంది విద్యార్థులకు పాఠశాలలోనే చికిత్స అందిస్తున్నామని, వారికి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

'మత్తుకు బానిస కావొద్దు'

మాట్లాడుతున్న డిగ్రీ ప్రిన్సిపల్ రఘురామ్‌రావు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

'అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా బుధవారం పట్టణంలోని కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సెబ్, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ రఘురామ్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా విలువైన జీవితాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణ సిఐ శ్రీనివాసులు, సెబ్ సిఐ మురళీ మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటు పడితే జీవితం ఎంత దుర్భరం అవుతుందో అవగాహన కల్పించారు. తదుపరి స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ నుంచి వినాయక సర్కిల్ వరకూ విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపకులు పద్మావతి, పరిషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామకృష్ణ, నాగప్ప, ఎన్‌సిసి కోఆర్డినేటర్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీగా శైలజ

ప్రజాశక్తి -అనంతపురం

బాధ్యతలు స్వీకరిస్తున్న శైలజ

జిల్లా గృహ నిర్మాణ సంస్థ ఇన్‌ఛార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్(పీడీ)గా శైలజ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం అనంతపురం ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఆమెను ఇన్‌ఛార్జి పీడీగా నియమించారు. ఇదివరకు పీడీగా ఉన్న డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి సెలవుపై వెళ్లడంతో ఈఈకి ఆ బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన శైలజకు గహనిర్మాణ శాఖ సిబ్బంది బొకేలు అందజేసి అభినందలు తెలిపారు.

కూలీలందరికీ ఉపాధి పనులు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-శెట్టూరు

మండలంలో పని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ఎంపిడిఒ నరసింహరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి పనుల నిర్వహణపై ఏపీవో, ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని కోరిన ప్రతి ఒక్కరికీ పని కల్పించి, నాణ్యతతో కూడిన పనులు చేపట్టాల్సిన బాధ్యత సంబంధి అధికారులపై ఉందన్నారు. ఇసి వెంకటరమణ, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్, చిత్రలింగ, ఈశ్వరమ్మ, జ్యోతి, కంప్యూటర్ ఆపరేటర్ తిప్పేస్వామి, మూర్తి పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఎరువులు

ప్రజాశక్తి-అనంతపురం

2,399 మెట్రిక్ టన్నుల కోరమండల్ కంపెనీ ఎరువులు బుధవారం జిల్లాకు చేరినట్లు అనంతపురం ఎడిఎ ఎం.రవి తెలిపారు. ఎడిఎ మాట్లాడుతూ జిల్లాకు వచ్చిన ఎరువుల్లో 20:20:0:13 ఎరువులు 877.8 మెట్రిక్ టన్నులు, 16:20:0:13 ఎరువులు 781.4 మెట్రిక్ ట న్నులు, 10:26:26 ఎరువులు 740.4 మెట్రిక్ టన్నులు వచ్చాయని, వీటిని ప్రసన్నాయపల్లి రైల్వే రేఖ్ పాయింట్‌లో పరిశీలించి గోదాములకు తరలించామని ఎడిఎ తెలిపారు.

దోమల నివారణకు స్ప్రేయింగ్

పెద్దపప్పూరు : స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ హాస్టల్, బాలికల హాస్టల్, పప్పూరు బాయ్స్ హాస్టళ్లలో దోమల నివారణకు బుధవారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. అలాగే దేవుని ఉప్పలపాడు గ్రామంలో దోమ లార్వా నివారణకు మురుగునీటి కాలువల్లో బిటిఐ స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం తహశీల్దార్ చిట్టిబాబు ఎండియు ఆపరేటర్లు, చౌక దుకాణం డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని, తూకం సరిగా ఇవ్వాలని, రేషన్ కార్డుదారులందరికీ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా సరుకులు తడవకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు పాల్గొన్నారు.

టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల

అనంతలో 62.36 - శ్రీసత్యసాయిలో 68.93 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్ఎస్‌సి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు బుధవారం రాత్రి విడుదల అయ్యాయి. మే24 నుంచి జూన్ 10వ తేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించారు. ఇందుకు సంబంధించి అనంతపురం జిల్లాలో 7785 మంది పరీక్షలు రాయగా 4854 ఉత్తీర్ణత సాధించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 4934 మంది పరీక్షలు రాయగా 3407 మంది ఉతీర్ణత సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. అనంతపురం జిల్లా కంటే సత్యసాయి జిల్లా 5.43 శాతం ఉత్తీర్ణత పెరిగింది. జిల్లాల వారీగా చూస్తే అనంతపురం 62.36 శాతం, శ్రీ సత్యసాయి జిల్లా 68.93 శాతం ఉతీర్ణత సాధించారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా బాలురు 60.42, బాలికలు 64.54 శాతం ఉత్తీర్ణతతో పాస్ అయ్యారు.

పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్‌లో జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి పని భారం తగ్గించాలని కోరుతూ బుధవారం నగర మేయర్ మహ్మద్ రసూల్ వసీంకు మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో విన్నవించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, అధ్యక్ష, కార్యదర్శులు ముత్తురాజు, నల్లప్ప మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల 16 రోజుల సమ్మె పోరాటంలో భాగంగా పాలకవర్గం, ఉన్నతాధికారుల హామీ మేరకు ఈ నెలలో జరిగే కౌన్సిల్ సమావేశంలో కార్మికుల సంఖ్యను వందకు పైగా పెంచాలని మేయర్ వసీం, హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తిని కోరారు. కొవిడ్, మలేరియా, గార్బేజ్, క్లాప్ ఆటో డ్రైవర్లకు వేతనం రూ. 15వేలు ఇవ్వాలని కోరారు. రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, పారిశుధ్యం, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికుల సమస్యలపై కమిషనర్‌తో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తామన్నారు. కార్మికుల కోసం హెల్త్ క్యాంపు త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. వీటిపై మేయర్ మాట్లాడుతూ కార్మికుల సంఖ్య పెంచడంపై కౌన్సిల్ సమావేశంలో ఖచ్చితంగా తీర్మానం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసమూర్తి, నారాయణస్వామి పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలను మాన్యువల్‌గా చేపట్టాలి

ఎస్‌కెయు విసికి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలను కౌన్సిలింగ్ ద్వారా కాకుండా మాన్యువల్‌గా చేపట్టాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్కేయూ వీసీ హుస్సేన్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చిరు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి, సిద్దు మాట్లాడుతూ డిగ్రీ ప్రవేశాలను గత ప్రభుత్వం ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ద్వారా ప్రవేశాలు నిర్వహించడం వల్ల గ్రామీణ విద్యార్థులకు అవగాహన లేక కోరుకున్న కాలేజీలో సీటు రాక ఇబ్బందులు పడ్డారన్నారు. కొందరికి సీట్లు రాక మేనేజ్మెంట్ కోటాలో వేలాది రూపాయలు ఖర్చుపెట్టి చదువుకుంటున్నారని అన్నారు. కావున మాన్యువల్ పద్ధతిలోనే డిగ్రీ ప్రవేశాలు నిర్వహించేలా ఉన్నత విద్యా మండలి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని కోరారు. స్పందించిన వీసీ డిగ్రీ ప్రవేశాలు మాన్యువల్‌గా నిర్వహించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని, వారి నిర్ణయం ప్రకారమే అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మారుతి, గణేష్, సాయికుమార్, వేణుగోపాల్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయు విసికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ కార్యాలయంగా మారుస్తాం

◆ వైసిపి కార్యాలయం కట్టడం అక్రమమే.. ◆ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు జి.వెంకటశివుడుయాదవ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

హెచ్‌ఎల్సీ స్థలంలో నిర్మించిన వైసిపి కార్యాలయాన్ని పరిశీలిస్తున్న పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

అనంతపురం జిల్లా కేంద్రంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయాన్ని స్వాధీనం చేసుకొని, రాబోయే రోజుల్లో ప్రభుత్వ కార్యాలయంగా వాడుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వప్రసాద్, అనంతపురము జిల్లా టిడిపి అధ్యక్షుడు జి.వెంకటశివుడు యాదవ్ తెలియజేశారు. అనంతపురం హెచ్ఎల్సీ కాలనీలో జలవనరుల శాఖ స్థలంలో సరైన అనుమతులు లేకుండా, అక్రమంగా నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయాన్ని టిడిపి నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్ మహాల్‌ను తలపించే విధంగా ప్రజా సొమ్ముతో వైసీపీ కార్యాలయాలు కట్టారని విమర్శించారు. హెచ్చెల్సీ కార్యాలయ స్థలాన్ని కబ్జా చేసి క్వార్టర్స్, చెట్లు కూల్చి వేసి ప్రజల సొమ్ముతో అక్రమంగా పార్టీ కార్యాలయం నిర్మిస్తున్నారన్నారన్నారు. దీనికి మున్సిపల్, అహుడా అనుమతులు లేవన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా, రాష్ట్ర స్థాయి జలవనరుల శాఖ అనాలోచిత నిర్ణయాల కారణంగా స్థలాన్ని కాజేసి నిర్మాణం చేపట్టారన్నారు. 1.50 ఎకరాల స్థలాన్ని వైసీపీ కార్యాలయం పేరిట దోచేయడం దారుణమని, ఇలాంటి వాటిని ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో వైసీపీ కార్యాలయాల్ని స్వాధీనం చేసుకుని వాటిని ప్రభుత్వ కార్యాలయాలుగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర కార్యదర్శులు టి.ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, దేవుళ్ల మురళి, ఏపి క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఈటె స్వామిదాసు, పార్లమెంట్ అధికార ప్రతినిధులు సరిపుటి రమణ, నారాయణస్వామి యాదవ్, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచి హరి, తెలుగుయువత పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, ఏపి రాష్ట్ర కురుబ సాధికార కమిటీ డైరెక్టర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

హెచ్ఎల్సి కార్యాలయంకు ఇప్పించండి

నగరంలోని ఇరిగేషన్ శాఖ స్థలంలో అక్రమంగా నిర్మించిన వైసిపి కార్యాలయం భవనాన్ని తుంగభద్ర హైలెవల్ పర్యవేక్షణ ఇంజినీర్ కార్యాలయానికి కేటాయించాలని ఏపీ ఎన్జీవో నగర శాఖ అధ్యక్షుడు మర్రిరెడ్డి మనోహర్ రెడ్డి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కోరారు. బుధవారం నాడు భవనం పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యేను ఇరిగేషన్ శాఖకు చెందిన 100 మంది ఉద్యోగులు ఏపీ.ఎన్జీవో నగర శాఖ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ.ఎన్జీవో ఉపాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ మహబూబ్ దౌల పాల్గొన్నారు.

విద్యా పథకాల అమలులో సమన్వయం అవసరం

◆ అర్హులకు పాఠశాలల్లో ప్రవేశం కల్పించాలి ◆ కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సమాజంలోని అట్టడుగు వర్గాలకు చెందిన కుటుంబాల్లోని పేద పిల్లలకు విద్యా పథకాలను అందించే విధంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేవారు. బుధవారం నాడు అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రెసిడెన్షియల్ పాఠశాలల అడ్మిషన్లు, అదనపు తరగతి గదులు, రైట్ టు ఎడ్యుకేషన్ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ శాఖల గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారన్నారు. అనాథలు, నిరుపేదలు, ఇతర అట్టడుగు వర్గాలకు చెందిన పిల్లలకు ఈ విద్యాలయాలు ఎంతగానో ఉపయోగంగా ఉంటాయన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రాధాన్యత ఇస్తూనే మిగిలిపోయిన సీట్ల విషయంలో నిజంగా అవసరమైన వారికి కేటాయించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇందుకోసం జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి నేతత్వంలో డిఇఒ, సాంఘిక సంక్షేమ శాఖ జెడి, ఇతర సంక్షేమ శాఖ అధికారులందరితో ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ప్రస్తుతం ఆయా విద్యాలయాల్లో మిగిలిపోయిన సీట్లకు అర్హులను ఎంపిక చేయడంతో పాటు ప్రతినెలా సమావేశమై ప్రగతిని సమక్షించుకోవాలని ఆదేశించారు. మెరిట్ లిస్ట్, నిబంధనల మేరకు సీట్ల కేటాయింపు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డీఈవో వరలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్, డిటిడబ్ల్యూవో రామాంజనేయులు, డీవిఈవో వెంకటరమణ నాయక్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ డిసిఒ మురళీకష్ణ, బీసీ రెసిడెన్షియల్ స్కూల్ కన్వీనర్ సంగీత, ఎస్ఎస్ఎ ఈఈ శివకుమార్ పాల్గొన్నారు.

సాదాసీదాగా తాడిపత్రి కౌన్సిల్ సమావేశం

ప్రధాన సమస్యల ఊసెత్తని సభ్యులు
హాజరవని మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశం ఆరు నెలల అనంతరం ఏర్పాటు చేయడంతో పట్టణ ప్రజలు ప్రధాన సమస్యల పరిష్కారం దిశగా సమావేశంలో చర్చ జరుగుతుందని ఆశించగా ఆ ఊసే లేకుండా కేవలం ఆరు అంశాల అజెండాను కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించి సమావేశాన్ని ముగించారు. జెసి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల మున్సిపల్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి నాటి హామీ మేరకు ఇతరులను ఛైర్మన్‌గా నియమించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఆయన అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తారని అందరూ భావించగా జెసి కౌన్సిల్ సమావేశానికి హాజరు కాలేదు. కేవలం ఆరు అంశాలతో వైస్ ఛైర్మన్ అబ్దుల్ రహీం అధ్యక్షతన బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన సమస్యలైన అండర్ డ్రైనేజీ, పారిశుధ్యం, కార్మికుల పెంపు, తాగునీరు, తదితర సమస్యలపై ఇప్పటికే పలుమార్లు స్పందించిన వినతి పత్రాలు, విన్నపాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చించకపోవడం పట్టణ ప్రజలు, మున్సిపల్ కార్మికులను విస్మయానికి గురిచేసింది. అజెండాలోని ఆరు అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. నాల్గో అంశమైన సర్ సివి రామన్ జూనియర్, డిగ్రీ కళాశాల భవనం నాణ్యత లోపభూయిష్టంగా ఉందన్న గొల్లపల్లి వాసుల ఫిర్యాదు మేరకు ఆ భవనంపై చర్యలు చేపట్టాలని తీర్మానించారు. వారం లోపు విద్యార్థులను సురక్షిత భవనంలోకి తరలించడంతో పాటు రెసిడెన్షియల్ బిల్డింగ్‌ను సీజ్ చేయాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే జరిగబోయే నష్టానికి కాలేజ్ యాజమాన్యం బాధ్యత వహించాలని నోటీసులు జారీ చేశామని తెలిపారు.

శిథిలావస్థలో హెచ్ఎల్‌సి కాలువలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని తుంగభద్ర ప్రధాన కాలువ నుంచి ఆయకట్టు భూములకు నీరు ప్రవహించే డిస్ట్రిబ్యూటర్లు శిథిలావస్థకు చేరాయి. ఆయకట్టు కాలువల్లో దట్టంగా ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు పెరగడంతో హెచ్ఎల్‌సి సిల్ట్(ఒండు) పేరుకు పోయింది. ఇక ఇటీవల కురిసిన వర్షాలకు కాలువ ఎక్కడికక్కడ కోతకు గురైంది. ఈ పరిస్థితుల్లో హెచ్ఎల్‌సి కాలువ ద్వారా ఆయకట్టు భూములకు సాగునీరు ఎలా అందుతుందని ఈ కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. ప్రధానంగా గోవిందవాడ, బొల్లనగుడ్డం, బొమ్మన హాల్, కురవల్లి, శ్రీధరగట్ట, గోనేహాల్, బండూరు, దేవగిరి గ్రామాలకు చెందిన హెచ్ఎల్‌సి ఆయకట్టు రైతులు సాగునీటి విషయమై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాలువ మరమ్మతులు చేపట్టడంతో పాటు పిచ్చి మొక్కలు, సిల్ట్ తొలగించి ఆయకట్టు భూములకు సజావుగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. డిస్ట్రిబ్యూటర్ల పరిస్థితిపై సంబంధిత అధికారి మద్దిలేటిని వివరణ కోరగా నిధులు లేవంటూ సమాధానం దాటవేశారు.

ప్రయివేటు పాఠశాలలపై చర్యలకు ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-గుత్తి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఎంఇఓ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రమేష్ మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలల్లో పుస్తకాలను అధిక ధరల విక్రయిస్తున్నారని, అనుమతులు లేకుండా రెసిడెన్షియల్ పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేనియెడల విద్యార్థి సంఘాలను కలుపు కొని ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రవి, బాలాజీ, ధన, వినయ్, ఈశ్వర్, గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే కుమారుని పరామర్శ

ప్రజాశక్తి-పామిడి

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఈశ్వర్

మండలంలోని రామగిరి ఎగువతండా గ్రామంలో డయేరియా ప్రబలి రేణుకాబాయ్ మృతి చెందింది. అలాగే దిగువ తండా గ్రామంలో టిడిపి సీనియర్ నాయకుడు వెంకటేష్ నాయక్ అనారోగ్యంతో కన్ను మూశారు. ఈ విషయం తెలుసుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ఆయా గ్రామాల్లో పర్యటించి మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈశ్వర్ మాట్లాడుతూ డయేరియా నివారణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రజలకు కూడా అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామస్తులకు అండగా ఉంటామన్నారు. ఆయన వెంట నాయకులు ప్రభాకర్‌చౌదరి, బొమ్మ మోహన్, రాజేష్ నాయక్, రమేష్ నాయక్, రామాంజి నాయక్, వడ్డే ఆనంద్, కార్యకర్తలు ఉన్నారు.

వార్డుల్లో ఎమ్మెల్యే తనయుడి పర్యటన

గుంతకల్లు : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు, పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ బుధవారం పట్టణంలోని 6, 7వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న మోటార్ పంపు చెడిపోయి తాగునీటి సమస్య ఏర్పడిందని స్థానికులు తెలుపగా త్వరలోనే కొత్త మోటార్ ఏర్పాటు చేస్తామన్నారు. వేప చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్నాయని, వర్షాలు కురిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఫిర్యాదు చేయగా వేప చెట్టు తొలగిస్తామని హామీ ఇచ్చారు. 6వ వార్డులోని పాత స్కూల్ అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని, డ్రైనేజీ సమస్యను వివరించగా ఆయా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులు ప్రభాకర్‌చౌదరి, ఆర్.ఆర్.రమేష్, బొమ్మా మోహన్, ముసిలిరెడ్డి, కరూరు శివ, హరి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కు సమస్యలు వివరిస్తున్న ఐక్యవేదిక సభ్యులు

కమిషనర్ దృష్టికి 'దుర్గం' సమస్యలు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో నెలకొన్న పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై బుధవారం ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక(సమాచార హక్కు చట్టం) సంస్థ అధ్యక్షులు నాని, కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు సభ్యులు మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుకు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన కమిషనర్ జులై మొదటి వారం నుంచి దోమల నివారణకు ఫాగింగ్, క్రిమిసంహారక మందులు చల్లడం, తదితర చర్యలు చేపడతామని తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో ఐక్యవేదిక సభ్యులు వేణుగోపాల్, భీమసేన, శకుంతల, జ్యోతి, మీనాక్షి, అంజలి, హరిత, తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించడం అందరి బాధ్యత

కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపు నిచ్చారు. నగరంలోని జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం వారు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. తద్వారా వాయు కాలుష్యాన్ని నివారించవచ్చు అన్నారు. మానవ మనుగడకు అవసరమైన ఆక్సిజన్ మొక్కల ద్వారానే లభిస్తున్నదన్నారు. మొక్కలు వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించి జీవకోటికి అవసరమైన ఆక్సిజన్ విడుదల చేయడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షిస్తాయన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, అదనపు కమిషనర్ హరిబాబు, హార్టికల్చర్ ఎడి లక్ష్మీప్రసన్న, డివిఇఓ వెంకటరమణనాయక్, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటి నీరు పోస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

సాహూ మహరాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

సాహు మహరాజ్‌కు నివాళి

ప్రజాశక్తి-రాయదుర్గం

సాహూ మహరాజ్ జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) కార్యాలయంలో సాహు చిత్రపటానికి బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు ఆధ్వ ర్యంలో పూలమాల వేసి నివాళు లర్పించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. నాగరాజు మాట్లాడుతూ సాహూ మహరాజ్ దేశంలో రిజర్వేషన్ల పితామహుడిగా పేరుగాంచారని కొనియాడారు. బ్రాహ్మణుల పెత్తనం నుంచి దళితులు, బహుజనుల విముక్తి కోసం పోరాటం చేశారన్నారు. అనేక చట్టాల రూపకల్పన, సాంఘిక దురాచారాల నిర్మూలనకు సాహూ మహరాజ్ విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు ఎం.జానకిరాముడు, ఇన్‌ఛార్జి ఉలిగప్ప, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పలువురు బహుజన సమాజ్ పార్టీలో చేరారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ శ్రీదేవి

బాల్య వివాహాలను అరికడదాం : సిడిపిఒ

బొమ్మనహాల్ : సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలను అరికడదామని సిడిపిఒ శ్రీదేవి పిలుపునిచ్చారు. స్థానిక కస్తూరిబా గురుకుల బాలికల కళాశాలలో బుధవారం బాల్య వివాహాల నియంత్రణపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఒ శ్రీదేవి మాట్లాడు తూ కిశోర బాలికలకు వివాహం చేయడం చట్టపరంగా నేరమన్నారు. బాల్య వివాహం చేసినా, సహకరించినా, హాజరైనా తప్పే అన్నారు. అలాగే గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామాంజనమ్మ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మల్లికార్జున, శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్ కుళ్లాయిస్వామి, ఇన్‌ఛార్జి ఐసిడిఎస్ ఆఫీసర్, కణేకల్ కేజిబివి ఎస్ఒ కమలమ్మ, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులు శుభ్రం

నార్పల : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న తాగునీటి ట్యాంకులను బుధవారం అధికారులు శుభ్రం చేయించారు. ఎంపీడీవో ఏసీ రాముడు, ఈ ఓ ఆర్ డి శైలజారాణి గూగూడు గ్రామంలోని తాగునీటి ట్యాంకులను దగ్గరుండి శుభ్రం చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీటిని కాచి చల్లార్చి తాగాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం గూగూడు గ్రామంలోని పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. స్వచ్ఛమైన నీరు తాగాలని, కలుషిత నీరు తాగడం వల్ల వచ్చే రోగాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు శ్రీసాయి విద్యార్థుల ఎంపిక

గుత్తి : పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో పలువురు కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శ్రీబాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి పిలుపు మేరకు వి కేర్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించగా శ్రీసాయి డిగ్రీ కళాశాల నుంచి 105 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి వి కేర్ సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా 11 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని శ్రీసాయి డిగ్రీ కళాశాల క్యాంపస్ సీఇఒ ఎ.శ్రీరాములు, ప్రిన్సిపల్ డాక్టర్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, పిఆర్ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసన్నకుమార్, ప్లేస్‌మెంట్ అధికారి బాబాఫకృద్దీన్ అభినందించారు. కార్యక్రమంలో వి కేర్ సంస్థ ప్రతినిధులు డి.విక్రమ్, జి.దీప, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన వారితో శ్రీసాయి డిగ్రీ కళాశాల యాజమాన్యం

యువత 'మత్తు'కు దూరంగా ఉండాలి

ఎస్వీ డిగ్రీ కళాశాల ఛైర్మన్ డాక్టర్ సి.సోమశేఖర్‌రెడ్డి

మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న కళాశాల నిర్వాహకులు

ప్రజాశక్తి-అనంతపురం

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితంతో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల ఛైర్మన్ డాక్టర్ సి.సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సోమశేఖరరెడ్డి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కళాశాల ప్రధానాచార్యులు డా. వై.మధుసూదనరెడ్డి మాట్లాడుతూ మత్తుకు ఒకసారి అలవాటు పడితే, దాని నుంచి బయట పడాలంటే చాలా కష్టమని, ముఖ్యంగా అమ్మాయిలు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఎక్కువ శాతం యువత మత్తుకు అలవాటుపడుతున్నారని తెలిపారు. కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో మాదక ద్యవ్యాల రవాణా పెరిగిపోతుందని, దానిని కట్టడి చేయడం పోలీసు యంత్రంగానికి సవాల్‌గా మారిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. టి.శ్రీనివాసులు, ఎఒ శ్రీనాథ్, ఎన్ఎస్ఎస్ అధికారులు జి.ఆనంద్ బాబు, ఎస్.పురుషోత్తం, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రిబ్బన్ కట్ చేసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు, ముఖద్వారంలో ఏర్పాటుచేసిన లండన్ బ్రిడ్జి నమూనా

'అనంత'లో ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని గుత్తి రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'డీజే అమ్యూజ్‌మెంట్స్ ఎగ్జిబిషన్'ను బుధవారం ప్రారంభించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు జయప్రకాష్ మాట్లాడుతూ కేరళకు చెందిన డీజె అమ్యూజ్మెంట్స్ 15 ఏళ్లుగా పలు రాష్ట్రాల్లో ఎగ్జిబిషన్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొట్టమొదటిసారిగా అనంతపురంలో సరికొత్తదనంతో లండన్ బ్రిడ్జి ముఖద్వారంగా ఎంతో అద్భుతంగా ఆశ్చర్యపరిచే సన్నివేశాలు రూపొందిస్తూ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినోదం పంచేందుకు, పిల్లలు, పెద్దలు కుటుంబ సమేతంగా ఎగ్జిబిషన్‌లో గడిపేందుకు వీలుగా ఎప్పుడూ లేనివిధంగా సరికొత్త ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ మేనేజర్ రవీంద్ర, విజయకుమార్, రఘు, ప్రసాద్, షాహిద్ పలువురు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు

ప్రజాశక్తి-వజ్రకరూరు

పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ సుబ్బరాజు

సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక చర్యలు తీసుకుందామని ఉరవకొండ ఎంపీడీవో సుబ్బరాజు పేర్కొన్నారు. ఆయన బుధవారం ఉరవకొండ పట్టణంలోని శివరామి రెడ్డి కాలనీ, డ్రైవర్స్ కాలనీ, శ్రీలక్ష్మీ నరసింహస్వామి కాలనీ, అంబేద్కర్ నగర్‌లలో పర్యటించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్యుల సల హాలు పాటిస్తే సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకోవచ్చన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ, వైద్య సిబ్బంది సమన్వయం చేసుకొని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డయేరియా బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు చికిత్స చేసి మందులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డి చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్, పంచాయతీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి-బెళుగుప్ప

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసిన దాత ప్రమీలమ్మ

విద్యార్థినీ, విద్యార్థులకు విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని పలువురు వక్తలు సూచించారు. మండలంలోని జీడిపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం అనంతపురం నగరానికి చెందిన ఎజిఎస్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు ఎజి.సంజీవరెడ్డి సతీమణి ఏజీ ప్రమీలమ్మ రూ. 8 వేల విలువ చేసే నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, డిక్షనరీ ప్యాడ్లను విద్యార్థులకు అందజేశారు. అలాగే కోనంపల్లి పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, ప్యాడ్స్ అందజేశారు. పలువు రు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.మల్లారెడ్డి, హెచ్ఎం జి.గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, ఫకృద్దీన్, పెన్నోబిలేసు, సరస్వతి, ప్రకాష్, సూర్యనారాయణ, సుధ, మాధవి, లలితారాణి, శ్రీనివాసులు, ఉమాదేవి, మాధవి కుమారి, మల్లికార్జునబాబు, గ్రామ పెద్దలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం.. ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని కోట ప్రాంతంలో విద్యుత్ అక్రమ వినియోగంపై మంగళవారం రాత్రి విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 6వ వార్డులో ఉన్న పలు నివాసాల్లో అధికారులు విద్యుత్ మీటర్లను తనిఖీ చేశారు. రఫీక్‌ఖాన్ అలియాస్ డిష్ రఫీ, మహమ్మద్ ఖాన్ అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తుండడంతో వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

రామగిరి ఎగువతండాలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-పామిడి

మండలంలోని రామగిరి ఎగువతండాలో బుధవారం ఎద్దులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత పంచాయతీరాజ్ శాఖ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్యం కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నీటి పరీక్షలు చేశారు. ప్రాథమిక వైద్యాధికారి 4 బృందాలను ఏర్పాటు చేసి వారిచే గ్రామం మొత్తం సర్వే చేయిం చారు. సర్వేలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఓఆర్ఎస్ గురించి వివరించారు. అలాగే ఎఫ్‌పిసి ప్రోగ్రామ్స్ నిర్వహించారు. శిబిరానికి 30 మంది రాగా ఒక్క అతిసార కేసు నమోదు కాలేదు. రామగిరి ఎగువతండాను డిఎంహెచ్ఒ డాక్టర్ సుజాత, డిఐఒ డాక్టర్ యుగంధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలకు సాంబశివారెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-శింగనమల

టిడిపి కార్యకర్తల దాడిలో గాయపడి అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డిని బుధవారం నియోజకవర్గ వైసిపి నాయకులు ఎం.వీరాంజనేయులు, ఆలూరు సాంబశివారెడ్డి పరామర్శించారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని అతడి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. నియోజకవర్గంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దు.. పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. వారి వెంట వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆశ్రమానికి మతిస్థిమితం లేని మహిళ

ప్రజాశక్తి-రాయదుర్గం

కణేకల్లులో కొన్నిరోజులుగా మతిస్థిమితం సరిగా లేక సంచరిస్తున్న అసిఫాభాను(26)ను తాడిపత్రిలోని జీవ నిలయం ఆశ్రమానికి తరలించారు. ఆమె రాత్రివేళ పట్టణ వీధుల్లో తిరుగుతూ ఉండేది. దీంతో పట్టణం లోని స్వధర్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు కలుగోడు మనోజ్ కుమార్, సమాజ సేవకురాలు ఎస్జీటీ ఉపాధ్యాయురాలు ఎం.శశికళ ఆధ్వర్యంలో బుధవా రం రెవెన్యూ, పోలీస్, స్త్రీ శిశువు సంక్షేమ శాఖ అధికారులు మహిళా పోలీస్ పర్యవేక్షణలో ఆ మహిళను తాడిపత్రిలోని జీవ నిలయం ఆశ్రమానికి తరలించారు.

'ఉత్తమ' విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ పట్టణంలోని శ్రీకరిబసవ ప్రభుత్వ కళాశాల, బాలికల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. 5వేల చొప్పున నలుగురికి రూ. 20వేలను చెక్కు రూపంలో పూర్వ విద్యార్థులు అందజేశారు. ఇదే కళాశాలలో 1987-89లో చదివిన విద్యార్థులు సాకే భాస్కర్, శశికళ దేవి, మాధవీలత, వెంకట్, కృష్ణమూర్తి, రామాంజనేయులు, విజయ్, విశ్వరూపాచారి, భీమలింగ తదితరుల సహకారంతో కళాశాల ప్రిన్సిపల్ మమత అందజేశారు. ఎస్.కె ప్రభుత్వ జూనియర్ కాలేజ్(బాలురు) నుంచి ఎస్.మహమ్మద్ ఖలీద్(ఎంపీసీ), సి.హరికృష్ణ(బైపిసి), ఎస్.కె ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) నుంచి పి.హబీబా(బైపిసి), ఎస్.రంజిత(ఎంపీసీ) నగదు బహుమతులు అందుకున్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.పూర్వ విద్యార్థులను సన్మానించారు.

ఫ్యాక్టరీ బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని నేమకల్ గ్రామ శివారులో ఉన్న ఐరన్ ఓర్ ఫ్యాక్టరీ నుంచి దుమ్ము, ధూళి పంట పొలాలపై పడి పంటలు పూర్తిగా ఎదగడం లేదని, దీంతో రైతులు తీవ్రగా నష్టపోతున్నారని సిపిఐ రాష్ట్ర నాయకుడు జాఫర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన బుధవారం స్థానిక సిపిఐ నాయకులతో కలిసి ఐరన్ ఓర్ ఫ్యాక్టరీ ప్రభావిత పొలాలను పరిశీలించారు. అనంతరం జాఫర్ విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాక్టరీ యాజమాన్యం వెంటనే రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిబంధనల మేరకు గ్రామంలో వాటర్ ప్లాంట్, డ్రెయినేజీ, తదితర అభివృద్ధి పనులు చేపట్టడం లో పూర్తిగా విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు దాదాపీర్, మండల కన్వీనర్ హనుమంతు, రాయదుర్గం ఇన్‌ఛార్జి నాగార్జున, కణేకల్ శర్మ, రైతులు ఉన్నారు.

ఎమ్మెల్యే 'కాలవ'కు సత్కారం

రాయదుర్గం : ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును ఆల్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఘనంగా సత్కరించారు. పట్టణంలోని కాలవ నివాసంలో సాయంత్రం అసోసియేషన్ అధ్యక్షులు చెన్నవీర, కార్యదర్శి బిహెచ్ ఇస్మాయిల్ తదితరులు పూలమాలలు, శాలువాతో సత్కరించారు.

ఇంటర్ ఫలితాల్లో 'నారాయణ' విద్యార్థికి స్టేట్ ఫస్ట్ ర్యాంకు

విద్యార్థిని అనుష్కదేవిని అభినందిస్తున్న యాజమాన్యం

అనంతపురం : ఎపి జూనియర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో అనంతపురం నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఓలేటి అనుష్కదేవి జూనియర్ ఇంటర్(ఎంపీసీ)లో 468/470 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. కళాశాలకు చెందిన మొత్తం విద్యార్థులోల 97శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ అనుష్కదేవి, వారి తల్లిదండ్రులు, బోధన సిబ్బందికి అనంతపురం నారాయణ కళాశాల కోర్ డీన్ బికె.బద్రీనాథ్, డీన్ శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపల్ హిమబిందు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ప్రతిభ చాటిన ఎస్ఆర్ఐటి విద్యార్థులు

శింగనమల : బుక్కరాయ సముద్రం మండలంలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థులు మొంగో డిబి సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో విజయం సాధించారు. ఆధునిక డేటా బేస్ మేనేజ్‌మెంట్‌లో నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల విజయాలను చూసి గర్విస్తున్నామన్నారు. టిపిఒ డాక్టర్ ఎం.రంజిత్ రెడ్డి మాట్లాడుతూ మొంగో డిబి నుంచి వచ్చిన ఈ గుర్తింపు విద్యార్థుల కృషి, కళాశాలలో వారు పొందుతున్న విద్య నాణ్యతకు నిదర్శనం అన్నారు. సత్తా చాటిన విద్యార్థులను ప్రిన్సిపల్ డా. జి.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ యు.శ్రీనివాసులు, డాక్టర్ జి.హేమంత్ కుమార్ యాదవ్, పి.వీరప్రకాష్, డాక్టర్ చిత్రలింగప్ప, కె.కొండన్న, అధ్యాపకులు అభినందించారు.

సర్టిఫికెట్ అందుకుంటున్న సాంబశివారెడ్డి